బాలిక అదృశ్యం

మియాపూర్ , మే 27: మియాపూర్ పీఎస్ పరిధిలో మంగళవారం గోపాల్‌రావు నగర్ కాలనీలో ఎనిమిదేండ్ల బాలిక అదృశ్యమైన ఘటన చోటుచేసుకున్నది. అయితే బాలికను గుర్తించిన పోలీసులు ఆమెను తమ సంరక్షణలో ఉంచారు. తన పేరు జ్యోతిక, తల్లిదండ్రుల పేర్లు అఖిల, నవీన్ అని చెబుతుందని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే తమ సెల్ నం 8712568116 సమాచారం ఇవ్వాలని కోరారు.

కోచింగ్ కోసం వచ్చి..

కేపీహెచ్‌బీ కాలనీ : ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థిని అదృష్టమైన ఘటన కేపీహెచ్‌బీ కాలనీ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ, పశ్చిమగోదావరి, సఖినేపల్లి, గొండిసెంటర్‌కు చెందిన జిల్లెల స్మైలీ ఉద్యోగం కోసం 15 రోజుల క్రితం కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ కోచింగ్ తీసుకుంటున్నది. పక్కనే మరో హాస్టల్‌లో ఆమె సోదరుడు రమేశ్ ఉంటున్నాడు. 23న తన సోదరి స్మైలీకి ఫోన్ చేయగా.. ఫోన్ లిఫ్ట్ చేయలేదు. హాస్టల్‌కి వెళ్లి చూసేసరికి.. ఇంటికి వెళుతున్నాను అని చెప్పి వెళ్లిపోయినట్లు నిర్వాహకులు తెలిపారు. బంధుమిత్రులను విచారించిన ఫలితం లేకపోవడంతో రమేష్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉన్నది.

వ్యక్తి అరెస్ట్ ..

మియాపూర్ : మియాపూర్ పీఎస్‌తో సహా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని మియాపూర్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. మద్యం, దురాలవాట్లకు బానిసైన మహేశ్.. వాటిని తీర్చుకునేందుకు చోరీలకు పాల్పడుతున్నాడు. చందానగర్, మియాపూర్, ఆర్‌సీ పురం, జూబ్లీహిల్స్ పీఎస్‌ల పరిధిలో గతంలోనూ చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చాడు. అయినా అతడి బుద్ధి మారలేదు. తాజాగా ఆదిత్యనగర్‌లో ఇంట్లో చోరీకి పాల్పడ్డ మహేశ్‌ను పోలీసులు గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కొంపల్లిని మరింత అభివృద్ధి పరచాలి



అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిజాంపేట జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

కుత్బుల్లాపూర్, మే 27 : శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కొంపల్లి మున్సిపాలిటీని మరింత అభివృద్ధి పథంలో నిలిపేందుకు అధికారులు సమిష్టిగా ప్రణాళిక పద్ధతితో ముందుకు వెళ్లాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సూచించారు. మంగళవారం కొంపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే వివేకానంద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ సమస్య, నత్తనడకన కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు, అభివృద్ధి పనులు, శానిటేషన్ సమస్యలతో పాటు పలు సమస్యలపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేండ్లలో గ్రేటర్ హైదరాబాద్ నగరానికి దీటుగా శివారు మున్సిపాలిటీలైనా కొంపల్లి, దుండిగల్, నిజాంపేట్ కార్పొరేషన్ ప్రాంతాలు గణనీయంగా అభివృద్ధి చెందాయని అధికారులు అంకితభావంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ చంద్రమోహన్ రెడ్డి, కమిషనర్ కృష్ణారెడ్డి, మేడ్చల్ ఏసీపీ వెంకట్ రెడ్డి, అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌చార్జి సీఐ హనుమాన్ గౌడ్, ఇంజినీరింగ్, ఇరిగేషన్, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నిజాంపేట జర్నలిస్ట్ కాలనీకి బస్సు సౌకర్యం కల్పించాలి

దుండిగల్ : కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, 30వ డివిజన్‌లోని జర్నలిస్ట్ కాలనీ, పరిసర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలంటూ జర్నలిస్ట్‌కాలనీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కర్ల లాలయ్య, ముఖ్య సలహాదారులు దామెర జగదీశ్ గుప్తా, సభ్యులు శ్రీనివాసరావు మంగళవారంఎమ్మెల్యే వివేకానంద్‌కు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జర్నలిస్ట్ కాలనీ పరిసర ప్రాంతాల్లో నివాసాలు పెరిగాయని, డబుల్ బెడ్రూంలోకి ప్రజలు వస్తున్న నేపథ్యంలో రవాణా వసతి లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే కోరామన్నారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడంతో పాటు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని ఆదేశించడంపై కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం జర్నలిస్టు కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మియాపూర్, కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ ని కలిసి వినతి పత్రం అందజేశారు.

రెండో ఆర్ఓబీ పనులకు శ్రీకారం చుట్టాలి

రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

బాలానగర్, మే 27 : ఫతేనగర్ లో రెండో ఆర్ఓబీ నిర్మాణ పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టాలని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, హైడ్రా, రైల్వే అధికారులకు ఫతేనగర్ ఆర్ఓబీ పెచ్చులుడుతున్న సమస్యపై ఆయన ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఫతేనగర్ ఆర్ఓబీ మెట్ల మార్గం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బిక్షపతి, అఖిల్, బద్రీ శంకర్, సాగర్, కృష్ణ, బసవరాజ్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ

మాదాపూర్, మే 27: చందానగర్ లైట్‌హౌస్‌లో ట్రాన్స్‌జెండర్లకు మంగళవారం మొదటి స్కిల్లింగ్ బ్యాచ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కంప్యూటర్లు, టైలరింగ్, బ్యూటీషియన్, ఎంఎస్ ఆఫీస్ వంటి విభిన్న కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం ఉద్యోగ అవకాశాలు (ప్లేస్‌మెంట్ సపోర్ట్) కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మోహన్ రెడ్డి, యూనీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయలక్ష్మి, లైట్ హౌస్ మేనేజర్ ఆకుల శ్రీనివాస్, ట్రాన్స్‌జెండర్ కో-ఆర్డినేటర్ ముకుంద మాల పాల్గొన్నారు.

నాలా డీసిల్టింగ్‌ను పకడ్బందీగా చేపట్టాలి

డీసిల్టింగ్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

మియాపూర్ మే 27: నాలాల్లో డీసిల్టింగ్ పనులను పకడ్బందీగా చేయాలని హైదర్‌నగర్ కార్పొరేటర్ శ్రీనివాసరావు సూచించారు. కాలనీలు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలోని వెస్టర్న్‌హిల్స్ సొసైటీ, అడ్డగుట్ట కాలనీల్లోని నాలాల్లో చేపడుతున్న పనులను కార్పొరేటర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ వ్యాప్తంగా విస్తరించి ఉన్న నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని పేర్కొన్నారు. మురుగు, వరద నీరు ఆటంకం లేకుండా సాగిపోయేలా చేయాలన్నారు. వర్షాకాలంలోగా పనులను పూర్తిచేసి కాలనీలను ముంపు నుంచి కాపాడాలని కార్పొరేటర్ (శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజీవ్, మహాదేవ్, కాలనీ వాసులు పాల్గొన్నారు

డలాస్.. బీఆర్ఎస్ వేడుకల్లో..

మియాపూర్ ,మే 27: అమెరికా, న్యూజెర్సీ లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ , డలాస్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక వేడుకల్లో వివేకానంద నగర్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్ , మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్, క్రాంతి కిరణ్ , మాజీ కార్పొరేషన్ చైర్మన్ గ్యాదరి బాలమల్లు పాల్గొన్నారు. ఉద్యమ నాయకుడిగా తొలి సీఎం కేసీఆర్ నాయకత్వం వల్లే గులాబీ విశ్వమంతా వ్యాపించినట్లు తెలిపారు

అక్రమ నిర్మాణం కూల్చివేత

అల్లాపూర్, మే 27 : గాయత్రినగర్ హరిహర దేవస్థానానికి వెళ్లే దారిలో అక్రమంగా నిర్మించిన ఐదంతస్తుల భవనాన్ని నిర్మించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను జీహెచ్ఎంసీ ముసాపేట-23 టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం కూల్చివేయడం ప్రారంభించారు. రెండంతస్తుల భవనానికి అనుమతులు తీసుకున్న సదరు భవన నిర్మాణదారుడు అదనంగా మరో మూడు అంతస్తులు నిర్మించాడు. గ్రౌండ్ ఫ్లోర్‌లో వాహనాల పార్కింగ్ స్థలంలో షెటర్లు నిర్మించాడు. కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదు చేయగా వారు కూల్చివేతలు జరిపినట్లు తెలిపారు.

కార్మికులకు అండగా ఉంటా..

బాధిత డ్రైవర్ కు జీతం డబ్బులను అందిస్తున్న కార్మిక సంఘం నాయకుడు రవి

కేపీహెచ్‌బీ కాలనీ : పేదలకు అండగా ఉంటానని బీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకుడు, శ్రమశక్తి అవార్డుగ్రహీత రవి అన్నారు. మేడ్చల్ నియోజకవర్గం పూడూరులోని బాలాజీ ట్రాన్స్‌పోర్ట్‌లో జతేంద్ర డ్రైవర్ గా పనిచేసి మానేశాడు. జీతం డబ్బులు ఇవ్వడానికి యజమాని నిరాకరించగా.. బాధితుడు కార్మిక సంఘం నాయకుడు రవిని ఆశ్రయించాడు. వెంటనే సంస్థ యజమానితో మాట్లాడి రూ.45వేల జీతం డబ్బులను డ్రైవర్‌కు అందజేశారు. కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ పాల్గొన్నారు.

పచ్చి రొట్ట, జీలుగు విత్తనాల పంపిణీ

రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్న బాలిరెడ్డి

దుండిగల్ : గండిమైసమ్మ-దుండిగల్ మండలంలోని రైతులు సబ్సిడీపై అందజేస్తున్న జీలుగ విత్తనాలు, జనుము పంపిణీ సద్వినియోగం చేసుకోవాలని బౌరంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం బౌరంపేటలోని కార్యాలయంలో పచ్చిరొట్టల పంపిణీ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి యాదగిరితో కలిసి ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను, జీలుగు, జనుమును పంపిణీ చేస్తుందని తెలిపారు. జనుము బస్తా రూ.5020 ఉండగా సబ్సిడీపై రూ. 2510 లకు, జీలుగు బస్తా రూ.4275 ఉండగా రైతులకు అన్న రూ.2137.50 లకు అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకంతో పాటు, ఆధార్ జిరాక్స్ , ఫోన్ నెంబర్ అంద చేయాల్సి ఉంటుందన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

దుండిగల్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, ప్రగతి నగర్‌లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలంటూ ప్రజాస్వామ్య వాదుల సంక్షేమ సమితి ఐక్యవేదిక (పీవీఎస్ఎస్) ప్రతినిధులు కోరారు. నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ ఆలీ ని కలిసి 30 సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. వాటిని పరిష్కరించేందుకు కమిషనర్ చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్ సానుకూలంగా స్పందించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీవీఎస్ఎస్ అధ్యక్షుడు శివశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదగిరి గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మధుసూదన్ రావు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

హస్మత్‌పేట బోయిన్ చెరువుకట్టపై అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ నరసింహయాదవ్

బాలానగర్, మే 27 : డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అన్నారు. మంగళవారం మైత్రివనం కాలనీలో పర్యటించి కాలనీ వాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా డ్రైనేజీ రోడ్డు డ్యామేజ్ సమస్యలు ఉన్నాయని కాలనీవాసులు తెలియజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. జలమండలి అధికారుల నిర్లక్ష్యం కారణంగా పలు ప్రాంతాల్లో తరచు డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జలమండల, జీహెచ్ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో డివిజన్ సమస్యలపై సమగ్రంగా సమీక్ష చేసి కార్యాచరణ చేపట్టాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ ఆశ, జలమండలి మేనేజర్ తేజ, కాలనీ అధ్యక్షులు జగన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామకృష్ణ, సెక్రటరీ హనుమంతరావు, నాయకులు నాగేశ్వరరావు, చరణ్, మురళి గౌడ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

చెరువు రిటైనింగ్ వాల్ పనులకు అడ్డు చెప్పరాదు..

హస్మత్ పేట బోయిన్ చెరువు రిటైనింగ్ వాల్, వాకింగ్ ట్రాక్ పనులకు స్థానికులు అడ్డు చెప్పరాదని కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ సూచించారు. మంగళవారం టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. రిటైనింగ్ వాల్ వాకింగ్ ట్రాక్ పనులకు అడ్డు చెప్పడం వలన పనులు జాప్యం జరిగే అవకాశం ఉందన్నారు. ప్రజలందరూ అభివృద్ధి పనులకు అడ్డు చెప్పరాదని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ రమేశ్, టీపీఎస్ సోమేశ్, ఇంజినీరింగ్ భాగం ఏఈ ఆశ, నాయకులు క్రరే జంగయ్య, గడ్డం నర్సింగ్ రావు, శ్రీనివాసరెడ్డి, బాలరాజ్, నగేశ్, రాజు గౌడ్, బస్తీవాసులు పాల్గొన్నారు.

ఆలయ ఆదాయ వ్యవహారాలపై విచారణ జరిపించాలి

మీడియాతో మాట్లాడుతున్న మన్నే ముత్యాలు

దుండిగల్, మే 27: కుత్బుల్లాపూర్ నియోజక వర్గం , గాజులరామారం సర్కిల్, సూరారం డివిజన్ పరిధిలోని, సూరారం కట్ట మైసమ్మ ఆలయం ఆదాయ వ్యవహారాలపై దేవాదాయ శాఖ కమిషనర్ విచారణ జరిపించాలని పలువురు పుర ప్రముఖులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ఫిబ్రవరిలో సూరారం కట్ట మైసమ్మ ఆలయాన్ని దేవాదాయ శాఖ తమ ఆధీనంలోకి తీసుకుందన్నారు. కట్ట మైసమ్మ జాతర మహోత్సవం సందర్భంగా ఆలయానికి లభించిన ఆదాయ, వ్యయాల్లో అవకతవకలు చోటు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ఆలయ ప్రాంగణంలోని కొబ్బరికాయల దుకాణం , పూజా సామగ్రి దుకాణం వేలం ద్వారా లభించిన రూ. 5 లక్షలు పక్కదారి పట్టినట్లు తెలిపారు. నాటి తాత్కాలిక కార్యనిర్వహణాధికారి, కొందరు స్థానికులతో కలిసి తమ ఇష్టానుసారంగా నిధులను దుర్వినియోగం చేశారన్నారు. దీనిపై దేవాదాయ శాఖ కమిషనర్ పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మన్నె ముత్యాలు, రాఘవరెడ్డి, గణేశ్, శశిధర్ రెడ్డి, మన్నె ప్రసాద్ పాల్గొన్నారు.

మదన్‌లాల్‌కు నివాళి..

మూసాపేట, మే 27 ఖమ్మం జిల్లా, వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు మదన్‌లాల్ పార్థివ దేహానికి మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ నివాళులర్పించారు. మదన్‌లాల్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శిల్పారామానికి.. ఆఫ్రికా మీడియా డెలిగేట్స్

కొండాపూర్ : సెంట్రల్ అండ్ వెస్ట్ ఆఫ్రికా మీడియా డెలిగేట్స్, కంటెంట్ క్రియేటర్స్ మంగళవారం మాదాపూర్‌లోని శిల్పారామం సందర్శించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కళాకారులు నృత్యరీతులతో తెలియజేశారు. పల్లెటూరి వాతావరణంలో ఏర్పాటుచేసిన చేనేత హస్తకళ ఉత్పత్తులను తిలకించి, కొనుగోలు చేశారు. కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్ అఫైర్స్ కృతిక భరద్వాజ్, ఐఎఫ్ఎస్ ఆఫీసర్ అన్నపూర్ణ సింగ్ పాల్గొన్నారు.

మాదాపూర్ : ఫ్యామిలీ డాక్టర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ఫ్యామిలీ డాక్టర్స్ చాప్టర్ క్లాసెస్, సీఆర్ పాలీ క్లినిక్ సంయుక్తంగా కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లోని పాలిక్లినిక్‌లో డాక్టర్లకు సీపీడీ తరగతులు నిర్వహించారు. వైద్యులు విచ్చేయగా ఫౌండేషన్ డాక్టర్ కె.రజని స్వాగతం పలుకగా అడ్వైజర్, డాక్టర్ రంగారావు వారిని సన్మానించారు.

మావోయిస్టు పేరుతో బెదిరింపులు..

జీడిమెట్ల : మావోయిస్టు పేరుతో షాపూర్‌నగర్‌లో బెదిరింపు లేఖ కలకలం సృష్టించింది. ఈ ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. షాపూర్‌నగర్‌కు చెందిన కూన రవీందర్‌గౌడ్ కుమారుడు రాఘవేందర్ గౌడ్ (కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ సోదరుని కుమారుడు)ను చంపుతామని లేఖలో బెదిరింపులకు పాల్పడ్డారు. అయితే ఇంటి ముందు తులసి మొక్కను ధ్వంసం చేసి.. ఎరుపు రంగు టవల్‌లో.. కారుపై కాగితాన్ని ఉంచిన ఓ వ్యక్తి రూ. 50లక్షలు ఇవ్వకపోతే.. తులసి మొక్కను ధ్వంసం చేసిన మాదిరిగానే.. నీ కొడుకును చంపుతానంటూ రాసి బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ నెల 21న ఈ ఘటన జరగగా.. సీసీ కెమెరాల్లో పరిశీలించగా ఓ వ్యక్తి మాస్క్ ధరించి వచ్చినట్లు గుర్తించిన రాఘవేందర్ గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు.

అల్లాపూర్ : పిల్లలు చిన్నతనం నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలని బంజారాహిల్స్ లయన్స్ క్లబ్ చైర్‌పర్సన్ కెల్లా వెంకటరావు అన్నారు. వెంకటరావు తనయ తేజామైతన కిడ్జీ బ్యాంక్‌లోని రూ. 25 వేల నగదును స్కూలు ఫీజు చెల్లించలేని 9వ తరగతి పేద విద్యార్థికి తన పుట్టినరోజు సందర్భంగా ఏడాది ఫీజు విరాళంగా అందజేసింది.

శిశువు మృతదేహం లభ్యం

శేరిలింగంపల్లి : కొండాపూర్ జిల్లా దవాఖాన ఆవరణలో రెండు రోజుల మగ శిశువు మృతదేహం లభ్యమైన ఘటన గచ్చిబౌలి పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. మృతదేహం దవాఖాన ఆవరణలో ఓ మూల పడి ఉందని సోమవారం అర్ధరాత్రి డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. గచ్చిబౌలి పోలీసులు శిశువు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మూడు రోజుల క్రితం ఓ గర్భిణీకి జన్మించిన శిశువు మరణించగా డాక్టర్లు కుటుంబసభ్యులకు అప్పగించినట్లు సమాచారం. ప్రస్తుతం దొరికిన మృతదేహం ఆ శిశువేనా లేక ఇంకేవరైనా వదిలి వెళ్లారా.. అనే కోణంలో గచ్చిబౌలి పోలీసులు విచారిస్తున్నారు. ఇటీవల డెలివరీ అయిన కేసుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. దవాఖాన ఆవరణ, బయట సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు ఉపయోగకరంగా ఉంటాయని చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి అన్నారు. పీజేఆర్ స్టేడియంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్‌పోటీల విజేతలకు కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి బహుమతులను అందజేశారు.

- కొండాపూర్